క్లుప్తంగా

పోలీసుల తనిఖీలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద ఆదివారం సాయంత్రం ఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల పత్రాలు, వాహనదారుల లైసెన్సులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఒస్మాన్ పాల్గొన్నారు.

నేడు పోడు పట్టాల పంపిణీ

కెరమెరి: మండలంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు పోడు రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ తెలిపారు. నవంబర్‌లో పోడు భూముల సర్వే చేసిన రైతులకు మాత్రమే పట్టాల పంపిణీ ఉంటుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని సూచించారు.

'బీజేపీని బలోపేతం చేయాలి'



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కెరమెరి: గ్రామీణ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని హైదరాబాద్‌కు చెందిన విస్తారక్ చంతకుంట విఠోభా అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బూత్ స్థాయి స్వశక్తి కేంద్రాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంతో పాటు సాంగ్వి తదితర గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో మేరాబూత్ సబ్ మజ్‌బూత్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. 9 సంవత్సరాల నుంచి పార్టీ చేసిన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను గ్రామీణులకు అందించారు. నాయకులు వేణుగోపాల్, రాథోడ్ సాగర్, నవీన్, తిరుపతి, విజయ్‌శేఖర్, మోఘాజి, మనోహర్, డిగాంబర్, మోతిరాం ఉన్నారు.

ఆదివాసీలతో సీఆర్టీ పోస్టులు భర్తీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

తిర్యాణి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐటీడీఏ పరిధిలో నడుస్తున్న పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టులను ఆదివాసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో గిరిజనేతరులకు అవకాశం కల్పిస్తే ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజనులకు న్యాయం చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆత్రం గోపాల్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : స్పై
కాగజ్‌నగర్
వెంకటరమణ : ఆదిపురుష్

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.130
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	80
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	120
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్



వ్యవసాయ పనుల్లో బిజీగా రైతు

రైతు చైతన్యమేది..?

- ప్రారంభానికి నోచని 'మన తెలంగాణ –మన వ్యవసాయం'
- జాడలేని కార్యక్రమాలు
- గతంలో సాగు అంశాలపై అవగాహన

కెరమెరి: పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్వహించే 'మన తెలంగాణ –మన వ్యవసాయం' కార్యక్రమం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో భాగంగా సాగులో మెలుకువలు, యంత్ర రాయితీ, పంటల బీమా తదితర అంశాలపై గతంలో సదస్సులు నిర్వహించే వారు. ఐదేళ్లుగా దీన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో రైతులకు సలహాలు, సూచనలు కరువయ్యాయి. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో, 6,442 మంది రైతులు ఉండగా, 29,500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన కరువు..

ఖరీఫ్ సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన లేకపోవడంతో రైతులు ఒకే రకం పంటలు వేస్తూ, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగిస్తూ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

తీవ్రంగా నష్టపోతున్నారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులను చైతన్యం చేసేందుకు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యవసాయ శాఖాధికారులు రైతు చైతన్య యాత్ర పేరిటా గ్రామాలకు వెళ్లి అన్నదాతలకు పంటల సాగుపై అవగాహన కల్పించేవారు. అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాలకు వెళ్లి ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అంశాలవారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి రైతుల సంతకాలు సేకరించేవారు. ఇందులో భాగంగా భూసార పరీక్షలపై అవగాహన, పరీక్షల ఆవశ్యకత, పంటల మార్పిడి, పంటలకు మద్దతు ధర లేనప్పుడు ధాన్యం గోదాంలో నిల్వ చేసి రుణం పొందే విధానం, వార్షాభావ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలు, రుణాల సద్వినియోగం, పంటలను ఆశించే చీడపీడల నివారణ, కరువు కోరల్లో చిక్కుకున్నప్పుడు పాడి పశువుల అభివృద్ధి, పశు సంవర్ధక శాఖ రాయితీలు, విత్తనోత్పత్తికి ప్రోత్సాహం, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించేవారు. కాని గత ఐదేళ్లుగా కార్యక్రమాల ఊసే లేకుండా పోయింది.

సలహాలకు ఏఈవోలను సంప్రదించాలి



రైతులకు ఏమైనా సూచనలు, సలహాలు కావాలంటే సంబంధిత ఏఈవోలను సంప్రదించాలి. వారు ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటారు. అందుబాటులో లేకుంటే ఫోన్‌లోనైనా వారిని సంప్రదించవచ్చు. – ఎస్. గోపీకాంత్, మండల వ్యవసాయాధికారి, కెరమెరి

పేదలకు లయన్స్‌క్లబ్ సేవలు అందేలా కృషి

రెబ్బెన: నిరుపేదలకు లయన్స్ క్లబ్ సేవలు మరింత అందించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు కృషి చేయాలని 320జీ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ ఐపీడీజీ ఆర్. నారాయణరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతపర్చాలన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్టార్స్ నూతన అధ్యక్షుడిగా ఆర్. వెంకటరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అన్నం రమేశ్, కోశాధికారిగా చందర్, క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా వంగ మహేందర్, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా భాస్కర్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, మొదటి ఉపాధ్యక్షులుగా బంగారు రాజన్న, రెండో ఉపాధ్యక్షులుగా గోపాల్, సంయుక్త కార్యదర్శిగా సదానందం, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా సుప్రీం రాజ్, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా శంకర్, క్లబ్ మ్యాగజిన్ చైర్‌పర్సన్‌గా స్వప్న, ఉమెన్స్ కోఆర్డినేటర్‌గా శోభారాణి, క్లబ్ డైరెక్టర్లుగా



కార్యవర్గాన్ని అభినందిస్తున్న నారాయణ రెడ్డి

పారిపూడి, కవితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ట్ 320జీ అడిషనల్ సెక్రటరీ సర్వీసెస్ దుద్దిళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ కార్యవర్గం..

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని క్లబ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఉబెద్ బిన్ యాహియా(తిరిఖ్) ఎన్నిక కాగా, సెక్రటరీగా పుల్లూరి శంకర్, కోశాధికారిగా సీహెచ్ సంజయ్‌కుమార్, మొదటి ఉపాధ్యక్షుడిగా లయన్ వేణుగోపాల్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నారాయణరెడ్డి, వెంకటరమణారెడ్డి, సుదర్శన్, వెంకన్న, శంకర్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలని గిరిజనేతరుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు అనిల్ మోతేరావ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు, రైతుబంధు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులు దాదాపు 5 దశాబ్దాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అయినా నేటి వరకు హక్కు పత్రాలు లేవన్నారు. దీంతో బ్యాంకు రుణాల



మాట్లాడుతున్న ఫయాజ్

సదుపాయం, రైతుబంధు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సిద్ధార్థ్ కొట్టంబే, మారుతి, కిషన్, మొరాజి, శంకర్, హకీం అన్సారి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి వనం'లో ఓ సమాధి!

- పార్కుకు రావడానికి జంకుతున్న జనం
- మందుబాబులకు అడ్డాగా మారిన గుండాయిపేట ప్రకృతి వనం

కౌటాల: పల్లె ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. కానీ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఆహ్లాదం పంచాల్సిన పార్కుకు జనం రావడానికి జంకుతున్నారు. మండలంలోని గుండాయిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో సమాధి ఉండడంతో అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు.

కన్నెత్తి చూడని జనం..

గుండాయిపేటలో కౌటాల –గుండాయిపేట ప్రధాన రహదారికి సమీపంలో అధికారులు పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇందులో అధికారులు పలు రకాల మొక్కలు నాటి పెంచారు. గ్రామస్తులు సేద తీరేందుకు బెంచీలు సైతం ఏర్పాటు చేశారు. కానీ గ్రామస్తులు వనం వైపు కన్నెత్తి చూడడం లేదు. అందుకు కారణం ప్రకృతి వనం ఏర్పాటు చేస్తున్న సమయంలో ఓ సమాధిని సైతం పార్కు స్థలంలోనే కలిపి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం ఆ సమాధి పార్కులో ఉండడంతో గ్రామీణ ప్రజలు ప్రకృతి వనంలోకి రావడానికి జంకుతున్నారు. దీంతో ఆహ్లాదం పంచాల్సిన వనం



గుండాయిపేటలోని ప్రకృతి వనంలో సమాధి

మందు బాబులకు అడ్డాగా మారింది. వనం వైపు ప్రజలు రాకపోవడంతో వనంలోనే రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. అధికారులు స్పందించి వనం బయట సమాధి ఉండేలా ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అప్పటి అధికారులు గమనించకుండా సమాధిని సైతం కలిపి పార్కుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయం ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదు. ప్రజలు పార్కు సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు మూఢ నమ్మకాలు వీడి ప్రకృతి వనాలను సద్వినియోగం చేసుకోవాలి. - నస్రుల్లాఖాన్, ఎంపీడీవో

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో అమ్మవారిని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఇందిరానగర్ గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో బోనాలతో వచ్చి, పట్టు వస్త్రాలు, నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు వాహన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీని అడ్డుకున్న రాంపూర్ గ్రామస్తులు



ఆందోళన చేస్తున్న రాంపూర్ గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని రాంపూర్ గ్రామం పక్కన ఉన్న తారు ఫ్యాక్టరీ లారీని శనివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ నుంచి ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేసే విషవాయువు పెద్ద మొత్తంలో వెలువడుతుండడంతో శనివారం రాత్రి రాంపూర్ రహదారిపై బైటాయించి లారీలను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీని గ్రామానికి అతి సమీపంలో ఏర్పాటు చేయడంతో ఫ్యాక్టరీ నుంచి వెలువడే రసాయనాలతో కూడిన పొగతో అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి తారు ఫ్యాక్టరీని గ్రామం సమీపం నుంచి తొలగించాలని కోరారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు శివ, వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగూడలో తీవ్ర ఉద్రిక్తత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడలో ఆదివారం అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారు. ఇతర మతస్తులు చింపివేశారని గ్రామస్తులు కాగజ్‌నగర్–ఆసిఫాబాద్ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం ఫ్లెక్సీ చింపేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రూరల్‌పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగగా.. వీరికి బీజేపీ, భజరంగ్‌దల్ నాయకులు సంఘీభావం తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పాల్వాయి హరీశ్‌బాబు, వెంకటేశం, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



రూరల్ పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన

నత్తనడకన పనులు..!



పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న డైనింగ్ హాల్ నిర్మాణ పనులు

- 'మన ఊరు –మన బడి'లో 10 పాఠశాలలు ఎంపిక
- ఒకే పాఠశాలలో పనులు పూర్తి
- మిగితా పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు –మన బడి పనులు పైసల్లేక నత్తనడకన సాగుతున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలలో మేజర్, మైనర్ రిపేర్లుతో పాటు విద్యుత్ సౌకర్యం, కిచెన్‌షెడ్లు, టాయిలెట్స్, డైనింగ్‌హాల్, మంచినీటి సౌకర్యం వంటివి కల్పించాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే పూర్తి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌లు, ఎస్ఎంసీ చైర్మన్‌లు మిగతా పనులు పూర్తి చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఆయా పాఠశాలల్లో ఇంకా పనులు నత్తనడకన సాగుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో..

మండలంలో మొదటి విడతలో భాగంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో 10 పాఠశాలలు ఎంపిక కాగా ఎంపీపీఎస్, చేడ్వాయి పాఠశాలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా 9 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయ్యి పెయింటింగ్ కోసం చూస్తుండగా మరికొన్ని పాఠశాలల్లో పనులు చివరి దశకు రాలేదు.

అందని బిల్లులు..

మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 50శాతం పనులు పూర్తయినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో కాంట్రాక్టర్లు, ఎస్ఎంసీ చైర్మన్‌లు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే మిగితా పనులు పూర్తి చేస్తామని గుత్తేదార్లు చెబుతుండడంతో ఏం చేయాలో పాలుపోక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గడువు లోగా పనులు పూర్తి చేయడం ఉపాధ్యాయులకు సవాలుగా మారింది. గత నెలలో పూర్తి చేయాల్సిన పనులు, పాఠశాలలు ప్రారంభమైనా కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామాల్లో అకాడి వేడుకలు



దబ్బా గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు



చింతలమానెపల్లిలో బోనాలతో మహిళలు

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో అకాడి పండుగ జరుపుకున్నారు. స్థానిక గ్రామ దేవతల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, విస్తారంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు. అకాడి సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో అకాడి పండుగ జరుపుకున్నారు. స్థానిక గ్రామ దేవతల ఆలయాల వద్ద రైతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వంటలు చేసి వనభోజనాలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడి పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు. ఏటా గ్రామాల్లో అకాడి వేడుకలు నిర్వహిస్తామని రైతులు తెలిపారు.

గురుపౌర్ణమికి ముస్తాబైన సాయి మందిరం

- నేడు ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిర్డీసాయి మందిరం సోమవారం నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. అన్నదానం నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని వారం రోజులుగా ఆలయంలో భక్తులు సామూహిక సాయి చరిత్ర, గురుచరిత్ర పారాయణం చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం భక్తిశ్రద్ధలతో పుస్తక పఠనం చేస్తున్నారు. వ్యాసపౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో ఉదయం 5.15 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఇందారపు మధూకర శర్మ తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు మహాప్రసాదం (అన్నదానం), రాత్రి పల్లకీసేవ, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.



ఆలయంలో సాయినాథుడి మూల విరాట్

నేడు గురుపౌర్ణమి వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం స్థానిక ఎస్పీఎం న్యూ కాలనీ సత్యసాయి ఆలయంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 6.45 గంటలకు ప్రశాంతి పతాక ఆవిష్కరణ, 7 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబాకు అభిషేకం, 10.30 గంటలకు సాయి పాదుక పూజ, అనంతరం నామ సంకీర్తన, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా మంగళ హారతి, నారాయణ సేవ, అన్నప్రసాదం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటల నుంచి భజన, సత్సంగం, మహా మంగళ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.